క్లుప్తంగా

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



ఊరేగుతున్న మాండవ్య నారాయణస్వామి వారు

సామర్లకోట: భూ సమేత మాండవ్య నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్ గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠంసెంటర్, కొత్తూరు మీదుగా తిరిగి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. చక్రవర్తుల రఘురామ్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై స్వామి నాయుడు

కొత్తపల్లి: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై స్వామినాయుడు సూచించారు. మండలంలోని యండపల్లిలో శుక్రవారం రాత్రి పోలీసులు వారధి కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, పోలీసుల విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసై తమ భవిష్యత్తును చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో ఉత్సవాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాన్ బోల్తా
ముగ్గురికి గాయాలు



భోగాపురం సెంటర్ వద్ద బోల్తా పడిన వ్యాన్

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భోగాపురం సెంటర్ వద్ద శుక్రవారం వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వేగంగా వస్తున్న వ్యాన్ భోగాపురం సెంటర్ వద్ద ఉన్న వేగ నివారణ బోర్డులను తప్పించబోయి ప్రమాదవశాత్తూ తిరగబడింది. వ్యాన్‌లో ఉన్న చవల లక్ష్మి, పిల్లా వీరబాబు, కాకర సుబ్బారావులకు స్వల్ప గాయాలవ్వగా వారిని 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

సురక్షతో ప్రజల చెంతకే వైద్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



ఉప్పాడలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



చంద్రమాంపల్లిలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడ గ్రామ సచివాలయం-1 ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారు స్వగ్రామంలోనే వైద్యం చేయించుకునేలా ఇప్పటికే వెల్ నెస్ సెంటర్లను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పేదలకు మెరుగైన వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు గ్రామాల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో డాక్టర్లు 462 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, సర్పంచులు నక్కా మణికంఠబాబు, రావి రమేష్, ఎంపీటీసీలు మేరుగు ఎల్లాజీ, చొక్క సింగన్న, రాయుడు విష్ణు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి గడప వద్ద ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రమాంపల్లిలో సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనతపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నది జగనన్న ప్రభుత్వమేనన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత హౌసింగ్ చైర్మన్ దొరబాబు రిబ్బన్ కట్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



సురక్ష శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ, తహసీల్దార్, వైద్యులు

సామర్లకోట: మండలంలోని చంద్రంపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంఈఓ పి.వుల్లయ్య, సర్పంచ్ చీమల భవాని, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు తలాటం శ్రీను, తలారి సుధాకర్, తలాటం రాములు పాల్గొన్నారు. వైద్యులు ప్రశాంత్, శ్రీహిమవతి, సీహెచ్ భవ్యశ్రీ, సుజన్‌కృష్ణన్ రోగులను పరీక్షించారు. 412 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

నియోజకవర్గంలో పెరుగుతున్న వైఎస్సార్ సీపీ బలం



చంద్రరావును అభినందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటన తరువాత పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు నాయకత్వంపై ఆయన భరోసా ఇవ్వడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. దీనికి తోడు సామర్లకోట సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మన్యం చంద్రరావు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరడంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగింది. ఆయనకు బడుగు, బలహీన వర్గాల్లో మంచి పట్టు ఉంది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పనితీరు నచ్చక పోవడంతో కొంత కాలంగా ఆయన ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు.

వెయ్యి మందితో పడిపూజ



వేట్లపాలెంలో లక్షపత్రి పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

సామర్లకోట: వెయ్యి మంది అయ్యప్ప మాలధారులతో శుక్రవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. వేట్లపాలెంలోని ఆదిలక్ష్మి రైస్‌మిల్ ఆవరణలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 18 ఏళ్లుగా గోలి రవికుమార్ ఈ కార్యక్రమం నిర్వహించడంతో వెయ్యి మంది అప్పయ్య స్వాములచే లక్ష పత్రి పూజ ఏర్పాటు చేశారు. దాంతో జిల్లా నలుమూల నుంచి మాలధారులు పాల్గొన్నారు. కాకినాడకు చెందిన రవి గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజ నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- శ్రీరాంపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



శ్రీరాంపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే దొరబాబుకు సర్పంచ్ రావి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు కోరారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు ఎంత అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాయో ప్రజలు కళ్లారా చూశారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పేదల సాముహిక గృహ ప్రవేశాలు రాష్ట్ర చరిత్రలో ఓ మైలురాయి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 30.75 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో 22 వేల మందికి పట్టాలు ఇవ్వగా ఇప్పటివరకు 10 వేలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు నకా మణికంఠబాబు, సాన నాగు, పిర్ల గంగధర్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, నేరేళ్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తీరుపై ఆందోళన

పిఠాపురం: తాము బదిలీపై వెళ్లినా సర్వీస్ రిజిస్టర్లు రిలీవ్ ఇవ్వకుండా పిఠాపురం ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ ఇబ్బంది పెడుతున్నారంటూ పలువురు టీచర్ల ఆరోపించారు. ఎంఈఓ తీరుకు నిరసనగా శుక్రవారం పిఠాపురం ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. పిఠాపురం మండలంలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన లక్ష్మీశైలజ, పద్మజ, అనిత తదితర మహిళా ఉపాధ్యాయులు గత రెండు నెలలుగా తమ ఎస్‌ఆర్‌లు ఇవ్వాలని అడుతున్నా ఎంఈఓ సరైన సమాధానం చెప్పక పోగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని టీచర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని, తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

స్వామివారికి భస్మాభిషేకం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన ఉమా రామలింగేశ్వర స్వామి వారికి శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తు సోదరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మరిన్ని విజయాలు సాధించాలి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను వినియోగించుకుని విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి మహిళా యోగా పోటీల్లో పిఠాపురం బాదం మాధవరావు బాలికల పాఠశాల విద్యార్థినులు ముసిని సత్య శ్రావణి, కాడ పవిత్ర, అడియాల ఝాన్సీలక్ష్మి మీనాక్షి విశేష ప్రతిభ కనబరిచారు. వీరిని పిఠాపురం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే దొరబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబర్ నెలలో వియాత్నంలో జరిగే అంతరాతీయ యోగా పోటీల్లో విజయం సాధించి ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఆకాంక్షించారు. వారి విజయానికి కారణమైన ఏపీ యోగా అసోసియేషన్ కాకినాడ జిల్లా కార్యదర్శి, యోగా టీచర్ వనం సత్యప్రియ, పాఠశాల హెచ్ఎం జి.శ్యాంబాబురమణమూర్తిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం సాయిరామకృష్ణ

సామర్లకోట: పాఠశాల స్థాయిలో నిర్వహించే నాలుగు ఫార్మెటివ్ పరీక్షలు, సమ్మెటివ్ పరీక్షలకు ప్రణాళిక సిద్ధం చేసుకుని సన్నద్ధం కావాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎ-2 పరీక్షలలో విద్యార్థుల మార్కులను సబ్జెక్టుల వారిగా సమీక్షించారు. విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవా లని పిలుపునిచ్చారు. ప్రతి రోజు తమ పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఎస్.ఆదినారాయణ, రామాంజనేయలు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ సూచించారు. మండలంలోని మూలపేట షిలోహు చర్చి మినిస్ట్రీస్ చిల్డ్రన్ కేర్ ఇనిస్టిట్యూషన్‌లో శుక్రవారం ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఐదుగురు వికలాంగులకు ట్రై సైకిళ్లు, 12 మంది వితంతులకు కుట్టు మెషీన్లు, విద్యార్థులకు రూ.7 లక్షల చెక్కును అందజేశారు. సంస్థ అధ్యక్షుడు గీసాల శ్రీనివాస్, ఆదిలక్ష్మి, సీహెచ్ వెంకట్రావు, పాల్, కృప పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్ర సందడి



పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. 15వ తేదీ ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ఆచార్యుల రక్షాబంధనం, కలశస్థాపన ఉంటుందని ఈఓ తెలిపారు. నిత్యం ఉదయం దుర్గా సప్తశతి, బాలా పరమేశ్వరీ మంత్ర జపం జరుగుతాయన్నారు. అలాగే స్వామి వారికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి నవావరణార్చనలను ఆలయ అర్చకులు, అభిషేక పండితులు జరిపిస్తారని చెప్పారు. శరన్నవరాత్రిలో ప్రతి రోజు అమ్మవారికి రోజు ఒక అలంకరణ ఉంటుందన్నారు. ఒక రోజు చేసిన అలంకరణ మరుసటి రోజు 12 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు 15వ తేదీన బాలాత్రిపుర సుందరిగా, 16న అన్నపూర్ణ దేవి, 17న గాయత్రిదేవి, 18న లలితాదేవి, 19 మహాలక్ష్మి, 20న సరస్వతిదేవి, 21న మహిషాసురమర్థిని, 22న విజయదుర్గ, 23న రాజరాజేశ్వరిగా అలంకరించనున్నారు. సాయంత్రం అమ్మవారికి వెండి చీర అలంకరణలు ఉంటాయని వివరించారు. 23న విజయ దశమి సందర్భంగా మధ్యాహ్నం శమీ పూజ, అనంతరం గ్రామోత్సవం జరుగుతాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్ని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రూ.200 చెల్లిస్తే భక్తుల గోత్ర నామాలతో సాయంత్రం కుంకుమార్చన చేయిస్తామని ఈఓ తెలిపారు.

నవదుర్గలుగా చిన్నారులు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని ఒక ప్రైవేటు పాఠశాల చిన్నారులు శుక్రవారం నవదుర్గల అలంకరణల్లో అలరించారు.

నూకాలమ్మ, మరిడమ్మ తల్లి ఆలయాల్లో..

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ ఈఓలు సీహెచ్.రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ తెలిపారు. నిత్యం అమ్మవార్లు వివిధ అవతారాల్లో దర్శనం ఇవ్వనున్నట్టు వారు పేర్కొన్నారు.



నవదుర్గల అలంకరణలో చిన్నారులు

భువనేశ్వరీ పీఠంలో..

స్థానిక వర్తుల వారి వీధిలోని శ్రీభువనేశ్వరి పీఠంలో సైతం ఆదివారం నుంచి 24 వరకు నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి చింతా గోపిశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 23 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అదే క్రమంలో ఈ ఏడాది కూడా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలి రోజు అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 16వ తేదీ నుంచి నిత్యం ఉదయం 8 గంటల నుండి సాయంత్ర 6 గంటల వరకు అమ్మవారి పూజలు ఉంటాయన్నారు. పూజలు, చండీహోమాల్లో పాల్గొనే భక్తులు 98661 93557, 99890 88557 నంబర్లను సంప్రదించాలని కోరారు.



బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న భక్తులు

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు

మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.